## క్లుప్తంగా

### నేడు మీర్‌పేటలో తిరంగా ర్యాలీ

మీర్‌పేట: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా వీర జవాన్లకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మీర్‌పేట కార్పొరేషన్ బీజేపీ-1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్ ముదిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. లెనిన్‌నగర్ వాటర్ ట్యాంక్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు జరగనున్న ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్, అందెల శ్రీరాములుయాదవ్, తదితరులు హాజరవుతారని, నాయకులు, యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

### ఆర్థికసాయం అందజేత



స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కందుకూరు: తమ తోపాటు చదువుకున్న స్నేహితుడు ఇటీవల మృతి చెందడంతో మిత్ర బృందం మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేసి భరోసా కల్పించారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 2005-06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితుడు నారోజు బాలకృష్ణ మృతి చెందాడు. దీంతో పూర్వ విద్యార్థులు అంతా కలిసి రూ.50 వేల నగదును జమ చేసి గురువారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. తాము అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

### అరుణాచలానికి స్పెషల్ బస్‌లు

చైతన్యపురి: తమిళనాడులోని అరుణాచలానికి దిల్‌సుఖ్‌నగర్ -2 డిపో నుంచి స్పెషల్ బస్ సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. వచ్చే నెల 9న రాత్రి 7 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుండి బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. తిరిగి 11వ తేదీన మధ్యాహ్నం అక్కడ బయలుదేరి 12న సాయంత్రం ఆరు గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఒకొక్కరికి టికెట్ రూ. 3900 ఉంటుందని అడ్వాన్స్ బుకింగ్ కోసం టీజీఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారా కానీ, దగ్గరలో ఉన్న ఏటీబీ ఏజంట్ వద్ద కానీ బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9959444165, 9666350995, 7382838010 నంబర్లలో సంప్రదించవచ్చు.

### సినిమాలు సమాజ శ్రేయస్సు కోరాలి



లఘు చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

వనస్థలిపురం: సమాజానికి ఉపయోగపడే చిత్రాలు రావల్సిన అవసరం ఉందని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. దాశరథి థియేటర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం సహకారంతో వనస్థలి ఫిల్మ్ సొసైటీ వనస్థలిపురం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గ దేవాలయ కల్యాణ మండపంలో ప్రదర్శించిన లఘు చిత్రాల ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్బీ శ్రీరాం దర్శకత్వం వహించిన పసుపు కుంకుమ, కిరణ్ దగాని దర్శకత్వం వహించిన ఆదిపరాశక్తి, శశాంక్ దర్శకత్వం వహించిన మధుర గానం, అజయ్ తీగలపల్లి దర్శకత్వం వహించిన అబల అనే లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దాశరథి ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు ఎస్.వినయ్‌కుమార్, డా.మారంరాజు రామచంద్రరావు, సీహెచ్‌వీఆర్‌కే.మూర్తి, ఎస్.భుజంగరెడ్డి, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### శ్మశానవాటిక నిర్మించాలని వినతి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం(1, 9, 10వార్డులు)లో శ్మశానవాటిక నిర్మించాలని కోరుతూ గురువారం వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడానికి పట్టణానికి వచ్చిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి వినతిపత్రం అందించాడు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సింగాపురం పరిధిలో మూడు వార్డులు ఉన్నాయని, ఇప్పటికీ శ్మశానవాటిక లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, సమస్యను పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు సూచించారు. అదేవిధంగా సింగాపురం వెళ్లే ప్రధాన రహదారికి నిధులు కేటాయించి రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేను నాయకులు శాలువాతో సన్మానించారు.

# వైన్స్.. న్యూసెన్స్

- రోడ్లపైనే పార్కింగ్
- ఆరుబయటే సిట్టింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు




మీర్‌పేట ప్రధాన రహదారిపై వాహనాల పార్కింగ్

మీర్‌పేట: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వైన్ షాపులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగోలుగా వాహనాలు పార్కింగ్ చేయడం.. రోడ్లపైనే మద్యం సేవిస్తుండడంతో స్థానిక కాలనీల బాధలు వర్ణణాతీతంగా మారాయి. కొందరు వైన్ షాపుల వారు సర్వీసు రోడ్లను ఆక్రమిస్తుంటే.. మరింకొందరు ప్రధాన రహదారులపైనే వాహనాలు పార్క్ చేస్తున్నారు. దీంతో సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ట్రాఫిక్ సమస్యల్లో చిక్కుకుంటున్నారు. సంబంధిత శాఖా అధికారులు అటుగా కన్నెత్తి చూడకపోవడంతో ఇబ్బందులు నిత్యకృత్యమయ్యాయని స్థానికులు వాపోతున్నారు.



టీచర్స్‌కాలనీ వైన్‌షాపు ఎదుట బహిరంగంగా మద్యం సేవిస్తున్న మందుబాబులు

**రోడ్లపైనే పార్కింగ్....**

- మీర్‌పేట కూడలి సమీపంలో ప్రధాన రహదారిపై ఉన్న మద్యం దుకాణానికి సంబంధించి వాహనాలన్నింటినీ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రహదారి ఇరుకుగా ఉండడం.. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కు చేయడంతో రోజూ సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- గాయత్రినగర్ వద్ద ప్రధాన రహదారిపై ఉన్న వైన్‌షాపు నిర్వాహకులు సర్వీసు రోడ్డునే ఆక్రమించి పార్కింగ్ ఏర్పాటు చేశారు. దీనిపై గతంలో ట్రాఫిక్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా హడావుడి చేశారు తప్ప పూర్తి స్థాయిలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవంటున్నారు. సమీపంలో బస్‌షెల్టర్ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు.
- టీచర్స్‌కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న వైన్ షాపు సమీప కాలనీవాసులకు ప్రధాన సమస్యగా మారింది. రోడ్డుపైనే వాహనాలు నిలుపడం.. పగలు, రాత్రి తేడా లేకుండా రోడ్డుపైనే బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని స్థానిక కాలనీవాసులు తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఆదాయమే ముఖ్యమని, ప్రజల ఇబ్బందులు పట్టడం లేదని, దీంతో అడ్డూ అదుపు లేకుండా పోయిందని, ఇప్పటికైనా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భక్తజనం

# ఆధ్యాత్మిక శోభితం

- వర్ధనగర్‌లో వైభవంగా నల్లపోచమ్మ వేడుకలు
- నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, అన్నదానం

హయత్‌నగర్: వర్ధనగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ప్రారంభమైన వేడుకల్లో భాగంగా వేద పండితుల ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, గణపతి పూజ, హోమాలు, ఆవాహన, అభిషేకాలు వంటి అనేక శాస్త్రోక్త కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దీంతో కాలనీలో పండుగ వాతావరణం సంతరించుకుంది. స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. మిథున లగ్న పుష్కరాంశ సుముహూర్తంలో శుక్రవారం ఉదయం 7:06 నిమిషాలకు మహాయంత్ర సహితంగా అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారు. ఇందు కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణతో పాటు అన్నదానం ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, హయత్‌నగర్ నాయకుడు జీవన్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారని వర్ధనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శని, ఆదివారాల్లో అమ్మవారి ఒగ్గుకథ ఉంటుందని స్పష్టంచేశారు. ఆదివారం సాయంత్రం నిర్వహించే బోనాలతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## తిరంగా ర్యాలీని విజయవంతం చేయండి

బీజేపీ మండల అధ్యక్షుడు యాదీశ్



మాట్లాడుతున్న యాదీశ్

మహేశ్వరం: ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు చూపిన ధైర్యానికి సెల్యూట్ చేస్తూ జూన్ 3న మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా యాత్ర నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యాదీశ్ పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామం అటల్‌బిహార్ వాజ్‌పేయ్ వ్యవసాయ క్షేత్రంలో బీజేపీ మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గామ్ దాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్‌తో శత్రు దేశంలో తలదాచుకున్న టెరరిస్టులను అంతం చేశారన్నారు. భారత సైనికుల ధైర్యానికి సెల్యూట్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 3వ తేదీన సాయంత్రం 4 గంటలకు మహేశ్వరం మండల కేంద్రంలో సుమారు 2 వేల మందితో ర్యాలీ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్‌జీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ పలువురు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు పాపయ్యగౌడ్, మిద్దె సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, దేశ్యానాయక్, పంత్‌నాయక్, ముత్యం,యాదయ్యగౌడ్, కుండె కుమార్, సుదర్శన్ యాదవ్, శంకర్, శ్రీనివాస్, శ్రవణ్ పలువురు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో క్యాసారం పాండు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో జెడ్పీటీసీ మాజీ సభ్యులు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, జర్పుల రాజునాయక్ రూ.5వేల చొప్పున, మాజీ సర్పంచ్ జగన్‌నాయక్ రూ.4వేల ఆర్థికసాయంను మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం అందించారు. కార్యక్రమంలో భాస్కర్‌నాయక్, నందు, నర్సింహ, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సమావేశం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ద్వారకాపురి కాలనీ సీనియర్ సిటిజన్స్ సమావేశం స్థానిక కమ్యూనిటీహాల్‌లో జరిగింది. ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్స్ తమ సమస్యలు ఏవైనా వుంటే ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ నాయకులు ప్రసాద్, పానకాలరావు, విశ్వనాథ్, రంగాచారి, కళాధర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు లబ్ధి

పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి



ఆకులమైలారంలో ఇందిరమ్మ ఇంటికి మంజూరు పత్రం అందించి భూమి పూజ చేస్తున్న పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

కందుకూరు: ఇందిరమ్మ ఇళ్ల పథకంతో ఇళ్లు లేని పేదలకు లబ్ధి చేకూరుతుందని దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆకులమైలారం, రాచులూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనతోనే పేద, బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం చేకూరుతుందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎ.సత్యనారాయణ, ఎస్.మల్లేష్, ఎస్.జగన్, ఎ.సురేందర్, డి.నరసింహాచారి, జి.బాబు, ఆర్.సురేష్, అశోక్, చంద్రయ్య, రాజు, రాంరెడ్డి, ఆర్.జంగయ్య, జి.యాదయ్య, ఏ.శ్రీకాంత్, సత్యం, రజనీకాంత్, రాజు, పవన్, శివ, పాండు, మల్లేశ్, అమరేందర్, సూరి, సత్యం, నరసింహ, వెంకటేశ్, శ్రీశైలం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**కొత్తగూడలో భూమి పూజ**

కొత్తగూడలో పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి ఆధ్వర్యంలో లబ్ధిదారులు అరుంధతి, సరస్వతి, జరీనాబేగం, అలివేలుకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందించి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బి.సంజీవరెడ్డి, ఎస్.శేఖర్‌గౌడ్, ఎండీ ఖదీర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కె.కృష్ణ, దేవేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**అగర్‌మియాగూడలో..**

అగర్‌మియాగూడలో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఈ.శ్రీకాంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు ఈ.దిలీప్‌రెడ్డి, సభ్యులు అనిల్‌కుమార్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, యాదయ్య, రమేష్, భాస్కర్, లబ్ధిదారులు గీత, శివకుమార్, మహేశ్వరి పాల్గొన్నారు.

## అన్ని పార్కులను అభివృద్ధి చేస్తాం



బీఎన్‌రెడ్డినగర్‌లో థీమ్ పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, ఎస్ఈ అశోక్‌రెడ్డి తదితరులు

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలో అసంపూర్తి పార్కులను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని రూ.1.99 కోట్లతో చేపట్టిన పార్కు పనులను జోనల్ ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ రమేష్‌బాబులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కొంతమేర పార్కు పనులు జరిగి ఆగిపోయాయని పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ పార్కు ఉమెన్ థీమ్ పార్కు అని అన్ని హంగులతో అభివృద్ధి చేసి త్వరలో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీఈ దామోదర్‌రావు ,ఏఈ రాజ్‌కుమార్, జలమండలి డిప్యూటీ మేనేజర్ రాజగోపాల్, మేనేజర్ భవ్యారెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రావు, నాయకులు, కాలనీవాసులు పంపన వెంకటేశ్వరావు, ప్రవీణ్, వర్ధని, వాణి, శరత్‌కుమార్, తరుణంశర్మ, జైపాల్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శక్తినగర్ కాలనీలో చేపట్టిన డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీ సేవా ఇస్లావత్

## శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్

వనస్థలిపురం: తమ ఇల్లు, పరిసరాలను ప్రతిఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ అన్నారు. గురువారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శక్తినగర్ కాలనీలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కాలనీలలో నీరు నిలువకుండా, చెత్త పేరుకోకుండా పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శానిటేషన్ సిబ్బంది సక్రమంగా పని చేసేలా కాలనీ సంక్షేమ సంఘాలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ విఘ్నేశ్వరి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డుపై గుంతల పూడ్చివేత

ట్రాఫిక్ పోలీసుల పనితీరుపై అభినందన



రహదారిపై ఏర్పడిన గుంతలను జేసీబీ సహాయంతో పూడ్చివేయించిన ట్రాఫిక్ పోలీసులు

చేవెళ్ల: భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ట్రాఫిక్ పోలీసులు వర్షంలోనే జేసీబీ సహాయంతో మట్టి పోయించి గుంతలను పూడ్చివేయించి శభాష్ అనిపించుకున్నారు. గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మున్సిపాలిటీలోని హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై కేజీఆర్ గార్డెన్ ఎదుట భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షం పడినప్పుడు గుంతల్లో నిల్వడంతో అవి కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గమనించిన పట్టణ ట్రాఫిక్ సీఐ వెంకటేశం సిబ్బందితో కలిసి ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో జేసీబీ సహాయంతో మట్టిపోయించి చదును చేయించారు. తాత్కాలికంగా వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా చేశారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు, స్థానికులు ట్రాఫిక్ పోలీసుల పనితీరును అభినందించారు. ఇకనైనా అధికారులు, నాయకులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

## వర్షాకాలం.. పొంచివున్న ప్రమాదం

- ఏళ్లుగా కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు
- ఇంకా అసంపూర్తిగానే కల్వర్టులు, వరద కాలువల నిర్మాణం
- భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి అగమ్యగోచరం

వనస్థలిపురం: ఓ వైపు కొనసాగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు.. మరోవైపు ఇంకా పూర్తికాని కల్వర్టులు, వరద కాలువలు, క్యాచ్ పిట్‌ల నిర్మాణం... ఇక వర్షాకాలం మొదలు కావడంతో నాలాలు ఎక్కడున్నాయో, గుంతలు ఎక్కడున్నాయో, రోడ్డు మార్జిన్ ఎక్కడుందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది వర్షాకాలంలో వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద వరద ప్రవాహంలో రోడ్డు మార్జిన్ తెలియక రెండు కార్లు రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లడమే ఇందుకు నిదర్శనం.

**రెండేళ్లకు పైగా సా.. గుతున్న రోడ్డు విస్తరణ పనులు**

ఎల్‌బీనగర్ చింతలకుంట నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు చేపట్టిన విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు రెండేళ్లకు పైగా సాగుతున్నాయి. ప్రధాన రహదారి పనులు చాలావరకు పూర్తయినప్పటికీ రోడ్డు పక్కగా వరద నీటి కాలువలు, కల్వర్టులు, వాటిపై కప్పు, క్యాచ్‌పిట్‌ల నిర్మాణం ఇంకా అసంపూర్తిగానే ఉంది. వరద కాలువలకు సరైన అవుట్‌లెట్లు లేకపోవడం, భారీ వర్షాలు వచ్చినప్పుడు ఎగువ కాలనీల నుంచి వచ్చే వరద, రోడ్డుపై పారే నీటితో రోడ్డు మార్జిన్, పక్కనే ఉన్న నాలాలు, కల్వర్టులు కనిపించని పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో వర్షాకాలం వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశాలు ఉన్నాయి. గత ఏడాది ఆగస్టు 15న భారీ వర్షం కురిసిన సమయంలో వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద రోడ్డు మార్జిన్ తెలియక కారు పక్కనే ఉన్న కల్వర్టులోకి దూసుకెళ్లింది. అలాగే 16న మరో కారు పనామా చౌరస్తా సమీపంలోని కల్వర్టులోకి దూసుకెళ్లగా అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీసులు వారిని కాపాడారు. ఈ ఏడాది కూడా పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండడంతో వాహనదారులకు ప్రమాదం పొంచివుంది. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, సంబంధిత అధికారులు వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని కల్వర్టుల నిర్మాణం, దానిపై కప్పు, జంక్షన్ల వద్ద క్యాచ్‌పిట్‌ల పనులు, వరదనీరు సాఫీగా వెళ్లేలా అవుట్‌లెట్లు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



వనస్థలిపురం చింతలకుంట సమీపంలో..